క్లుప్తంగా

నేడు ఉచిత మెడికల్ క్యాంప్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంటల వరకు ఈ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఈ మెడికల్ క్యాంప్‌లో పలువురు వైద్య నిపుణులు సేవలు అందిస్తారని చెప్పారు. రాయచోటి మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ డాక్టర్ రమేష్, కడప రిమ్స్‌కు చెందిన డాక్టర్ ఆప్తమాలాజిస్ట్ డాక్టర్ సునీల్‌నాయక్, అలాగే రాయచోటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డెంటల్ సాధారణ వ్యాధి నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

ఓబులవారిపల్లె : మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం (నేడు) స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు హాజరవుతారని, ఉదయం 10.30 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలియజేశారు.

వాటర్ ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీకి పెన్నా నది నుంచి వచ్చే తాగు నీరు అందకపోవడంతో ఆదివారం గ్రామ సర్పంచ్ జానకిరామయ్య ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్య తెలిపారు. సిద్దవటం పెన్నానది నుంచి మాధవరం-1కు సరఫరా చేసే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, సిబ్బంది పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నట్టు ఆయన అన్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనులు

ఓబులవారిపల్లె : కొర్లకుంట పంచాయతీ చలం పాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. పాఠశాలలో గుంతలు ఏర్పడి నీరు నిలిచి విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. దీంతో ఆయన టిప్పర్ వాహనాలతో మట్టిని తోలించి చదును చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వత్తలూరు రోహిణి కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగ కోసం..





రాజంపేట టౌన్ : స్వాతంత్ర దినోత్సవం వచ్చేస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవం అనగానే ప్రతి ఒక్కరిలోను ఏదో తెలియని ఆనందం, మది నిండా ఉప్పొంగే సంతోషం. ఒకప్పుడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాల్లో జెండాను ఎగురవేసి ఆ వేడుకను ఘనంగా జరుపుకునేవారు. అయితే ఇప్పుడు అనేక మంది స్వాతంత్ర్య దినోత్సవం నాడు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల వ్యాపారులు స్వాతంత్ర్య దినోత్సవానికి చిహ్నంగా వివిధ రకాల వస్తువులను అందుబాటులోకి తీసుకొచ్చారు.

సేవ్ మణిపూర్



రోడ్డుపై మానవహారంగా ఏర్పడి ప్రార్థన చేస్తున్న దృశ్యం

సుండుపల్లె (రాయచోటి టౌన్) : మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటలను నిరసిస్తూ సేవ్ మణిపూర్ అనే నినాదంతో సుండుపల్లె మండల కేంద్రంలో సెయింట్ జాన్స్ లూథరన్ బేతనియ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి సేవ్ మణిపూర్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి కాపరి రెవరెండ్ కె.జ్ఞాన ప్రకాశం, సంఘ పెద్దలు వినోద్ కుమార్ రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెనగలూరు ఎస్ఐ బదిలీ

పెనగలూరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ హేమాద్రి మదనపల్లె పోలీస్ స్టేషన్-2కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డి పెనగలూరుకు బదిలీ అయినట్లు సమాచారం. గత ఏడాది నవంబర్ 18న పెనగలూరు ఎస్ఐగా హేమాద్రి బాధ్యతలు చేపట్టారు. దాదాపు 9 నెలలుపాటు సేవలందించారు.

వివాహం.. ఓ ఖరీదైన వేడుక

- స్టేటస్‌కు సింబల్‌గా మారిన పెళ్లి వేడుకలు
- ఖర్చుకు వెనకాడని ధనవంతులు
- అంతా తామై వివాహ వేడుకను జరిపిస్తున్న ఈవెంట్ ఆర్గనైజర్లు



వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన డెకరేషన్

రాజంపేట టౌన్ : పెళ్లి అంటే పందిళ్లు.. తాళాలు, తలంబ్రాలు అన్నది ఒకప్పటి మాట. అయితే కాలానుగుణంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా పెళ్లి కూడా ఒక ట్రెండ్‌గా మారిపోయింది. ముఖ్యంగా ధనవంతులు వారి స్టేటస్ కనిపించేలా తమ పిల్లల వివాహాన్ని వేదిక చేసుకుంటున్నారు. ఇందుకోసం ఖర్చు ఎంతైనా ఏమాత్రం వెనకాడటం లేదు.

ఆహ్వానించడం ఒక్కటే పెద్ద పని

ఒకప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల పెళ్లి చేయాలంటే హైరానా పడేవారు. సమయానికి అన్ని సమకూర్చగలమా లేదా అన్న ఆందోళన తల్లిదండ్రుల్లో ఉండేది. అయితే ఇప్పుడు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా వెడ్డింగ్ ఈవెంట్ ఆర్గనైజర్లు చూసుకుంటున్నారు. పురోహితుడు, మంగళవాయిద్యాలు, బ్యాండు, ఫోటో, వీడియో గ్రాఫర్స్, క్యాటరింగ్, ఆర్కెస్ట్రా ఇలా అన్ని వెడ్డింగ్ ఈవెంట్ ఆర్గనైజర్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివాహ వేడుక ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు అంతా తామై వివాహాలను జరిపిస్తున్నారు. అయితే ఇప్పుడు వివాహం సందర్భంగా ముఖ్యమైన బంధువులు, స్నేహితులు, ఆత్మీయులను వారి ఇళ్లకు వెళ్లి ఆహ్వానించడమే పెద్ద పని అని చెప్పాలి. కాస్త పరిచయం ఉన్నవారికి, తప్పనిసరిగా వివాహానికి ఆహ్వానించాలనే వారికి అనేక మంది వాట్సాప్‌లో వెడ్డింగ్ కార్డు పోస్టు చేసి వివాహానికి తప్పక హాజరుకావాలని చిన్నపాటి మెసేజ్‌తో ఆహ్వానిస్తున్నారు.

జీవనశైలిలో వచ్చిన మార్పే ప్రధాన కారణం

టెక్నాలజీ కారణంగా మనిషి జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి. దీంతో పెళ్లి జరిపించే ప్రక్రియ పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందువల్ల అన్నదమ్ముల్లు, వారి పిల్లలు ఇక బంధువులంతా కలిసి వివాహ వేడుకను జరిపించేవారు. అయితే ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం అన్నదమ్ముల్లు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండాల్సి వస్తుంది. ఈ కారణంగా మధ్య తరగతి కుటుంబాల వారు సైతం వివాహ వేడుకను జరిపేందుకు ఈవెంట్ ఆర్గనైజర్స్‌పై ఆధారపడాల్సి వస్తోంది.

భూతల స్వర్గాన్ని తలపించేలా..

ముఖ్యంగా ధనవంతులు వివాహ వేడుకలో తమ హోదాను తెలియజేసేందుకు డెకరేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహానికి వచ్చే వారు కల్యాణ మండపంలోకి అడుగుపెట్టగానే భూతల స్వర్గాన్ని తలపించేలా వేదికలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం భారీ సెట్టింగ్‌లు వేయిస్తున్నారు. ఇక అతిథులు కల్యాణ మండపంలోకి అడుగుపెట్టగానే వెల్‌కం చెప్పేందుకు వెల్‌కం గర్ల్స్, ఎక్కడ కూర్చున్నా వివాహ వేడుక కనిపించేలా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నారు.



వధూవరులను తీసుకొచ్చే పల్లకీ

పసందైన వంటకాలతో..

వివాహ వేడుకలో ముఖ్యమైనదైన భోజనాల కార్యక్రమానికి అధిక వ్యయం చేస్తున్నారు. అనేక మంది హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో పెద్దపెద్ద క్యాటరింగ్ సంస్థలకు క్యాటరింగ్ ఇస్తున్నారు. బాగా డబ్బున్న వారు ముప్పైనుంచి నలభై రకాల వంటకాలతో కూడా భోజనం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఐదారు రకాల ఐస్‌క్రీమ్‌లు, బీడాలను అందుబాటులో ఉంచుతున్నారు. అతిథులు కల్యాణ మండపంలోకి రాగానే వెల్‌కం డ్రింక్‌తోపాటు స్నాక్స్‌ను అందిస్తుండటం విశేషం.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

రాజంపేట : ఆర్టీసీకి ఆదాయం తీసుకొచ్చే వారిని ఆదర్శ ఉద్యోగులుగా గుర్తిస్తామని రాజంపేట డీఎం రమణయ్య తెలిపారు. ఆదివారం ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కార్మికులు, అధికారులు సమైక్యంగా కృషి చేయాలన్నారు. సూచనలు, సలహాలతో డిపో లాభాల బాటలో పయనించేందుకు అందరి సహకారం తీసుకుంటామన్నారు. విభాగాల వారీగా ఆదర్శ ఉద్యోగులను వారి విధులను బట్టి ఎంపిక చేస్తామన్నారు. అనంతరం ట్రాఫిక్‌లో పీఎల్ నరసారెడ్డి, మెయింటెన్స్‌లో నరసింహులు, ఇంధన పొదుపులో ఫిరోజ్, చంద్రలు ఆదర్శ ఉద్యోగులుగా ఎంపిక కాగా వారిని సత్కరించారు.



ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం రమణయ్య

లంకమల అభయారణ్యంలో కూంబింగ్



కూబింగ్ నిర్వహిస్తున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లోని లంకమల అభయారణ్యంలో ఆదివారం కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మద్దూరు, సిద్దవటం బీట్లలో సాబ్బావి బేస్ క్యాంప్‌ను తనిఖీ చేశామన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి సాబ్‌మోరా, ఎర్రమసికలు, మద్దూరు బీటు సరిహద్దు, కాలిబాటల రస్తా ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎక్కడా కూడా స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదని ఆమె తెలిపారు. డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఫారెస్టు బీట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, సాబ్బావి బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ



పూజలందుకున్న కుర్నూతల గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిన్నమండెం : మల్లూరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించకున్నారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. ఆలయ చైర్మన్ సామాన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్ర రాజులు భక్తులకు క్యూలైన్లు ద్వారా దర్శనాన్ని కల్పించారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం చంద్ర, రెడ్డిశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.

పెనగలూరు : మండలంలోని కట్టావారిపల్లి పంచాయతీ అప్పారాజుపేటలో ఆదివారం అంకాలమ్మ జాతర వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయం వద్ద జాతరను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటిలో పొంగుబాళ్లు పొంగించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు గ్రామంలోని ప్రతి కుటుంబం వారు తమ బంధువులను పిలిపించుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సాయివికాస్ రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన పవన్ కుమార్ నాయుడు అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆదివారం ముక్కా సాయి వికాస్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విప్లవాత్మకమైన సంస్కరణలతో వ్యవ‘సాయం’



సుద్దమళ్ల రైతు భరోసా కేంద్రం

రామాపురం : వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన ఎన్నో సంస్కరణలు చేపట్టి రైతన్నలకు చేదోడు వాదోడుగా ఉండాలన్నదే లక్ష్యంగా, సంకల్పంతో ఆ దిశగా ఎంతో అభివృద్ధికి జగనన్న తోడ్పాటునిస్తున్నారు. దేశానికి వెన్నుముక లాంటి రైతన్న గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల వ్యవసాయ రంగం కుదేలయ్యింది. ఈ పరిస్థితులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టి సారించి ప్రతి గ్రామ పంచాయతీకి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పించారు. గతంలో వ్యవసాయం దండగ అన్నవారికి రైతులలో మరింత ఆశాభావాన్ని కల్పించి వ్యవసాయాన్ని పండుగ చేయడానికి కృషి చేస్తున్నారు. రామాపురం మండలంలో 13 గ్రామ పంచాయతీలకు 13 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో ప్రస్తుతం 5,925 మంది రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులతోపాటు ఉద్యానశాఖకు సంబంధించిన పండ్లు, పూల మొక్కలు, కూరగాయల సాగు చేసే వారికి సబ్సిడీ అందిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం నాలుగు విడతలుగా రైతు భరోసా కింద రూ .32 కోట్లు రైతులు లబ్ధి పొందారు. 2019 అక్టోబర్ నాటికి 4,540 మంది రైతులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పథకాలతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. రైతు భరోసా కింద ఇచ్చే నగదు, పంట నష్టం, పంటల బీమా రైతుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తోంది. దీంతో రైతులకు అన్ని విధాలా ఆదుకుంటూ వారికి చేయూతనందిస్తూ బాసటగా నిలుస్తోంది.

రైతులకు అండగా ప్రభుత్వం



నాకు నాలుగు ఎకరాలు పొలం ఉంది. గత ప్రభుత్వంలో సరైన విధానాలు లేక ఇబ్బందులు పడ్డాం. జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా కింద డబ్బులు పడ్డాయి. మాకు వ్యవసాయ పరంగా ఎటువంటి సమస్య ఉన్న ఆర్బీకేల సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకుంటున్నాం. రైతులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

-వి.సుబ్బయ్య, రైతు, సుద్దమళ్ల, రామాపురం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నాకు మూడు ఎకరాలు పొలం ఉంది. రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంట బీమా, పంట నష్టంతో రైతుల కష్టాన్ని అర్థం చేసుకొన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. సీఎం జగన్‌కు రైతులందరూ రుణ పడి ఉంటాం.

- వలీ, రైతు, దూదేకులపల్లె, రామాపురం

ఆర్బీకేలు రైతులకు వరం



రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతుల పాలిట వరం. రైతుల కష్టం తెలిసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల ముగింటకే సేవలను అందిస్తున్నారు. రైతులకు ఆర్బీకేలు అన్ని రకాల సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రైతులకు ఎటువంటి సమాచారం కావాలన్నా ఆర్బీకే సిబ్బం ద్వారా తెలుసుకుంటున్నారు.

- నాగమణి, ఏఓ, రామాపురం మండలం

సేవా సంస్థకు విరాళం



చిట్వేలి : మానవత సేవా సంస్థకు చిట్వేలి శాఖ యువకులు రూ. 20 వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హేమంత్ కుమార్, శిల్పారెడ్డి వారి మిత్రులు వాసు, బాలు,శ్రీను, ఎం.శంకర్‌లు మానవత బాధ్యులకు నగదుకు సంబంధించిన చెక్కును అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, రంగారెడ్డి, శ్రీనివాసులు, రోళ్ల మోహన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతుల్లో చీనీ రైతుల దగా

పుల్లంపేట : మండల వ్యాప్తంగా రంగంపల్లె, రాచపల్లె, గారాలమడుగు, అప్పారాజుపేట, దొండ్లోపల్లి, రామసముద్రం, అనంతయ్యగారిపల్లి తదితర గ్రామాలలో సుమారు 150 హెక్టార్లు చీనీ పంటను సాగు చేస్తున్నారు. అయితే గతంలో టన్ను చీనీ కాయల ధర రూ. 45 వేల నుంచి రూ. 90 వేలు వరకు పలికేది. ప్రస్తుతం దళారులు రంగ ప్రవేశం చేయడంతో కేవలం రూ. 15 వేల నుంచి రూ. 17 వేలు వరకు మాత్రమే ధర పలుకుతోంది. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. తీరా పంట చేతికందే సమయానికి ధరలు లేకపోవడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మండలంలోని రైతులు కోరుకుంటున్నారు.

జన హృదయాలను గెలిచిన గద్దర్

మదనపల్లె : పాట, మాట, ఆటతో జనహృదయాలను గెలిచిన గద్దర్ ఏ ఒక్క వర్గానికి, భావజాలానికి పరిమితం కాలేదని, చెప్పదలచుకున్న విషయాన్ని మనస్సుకు తాకేటట్టు చెప్పగల గొప్ప వాగ్గేయ కారుడు గద్దర్ అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన(బాస్), వీసీకే పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జోహార్ గద్దరన్న సంతాప ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మిషన్‌కాంపౌండ్‌లో ర్యాలీని ఎమ్మెల్యే నవాజ్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు.

నిరుపేదల నీడకు ప్రభుత్వం అండ

- జిల్లాలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- ఊళ్లుగా మారుతున్న జగనన్న కాలనీలు
- లే అవుట్‌లో వసతులను కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం



ఈయన పేరు కమాల్ సాబ్ లక్కిరెడ్డిపల్లె మండలం చింతలకుంటవాండ్లపల్లె వాసి. ఈయన ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక బాడుగ ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తుండేవాడు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటిపట్టాతోపాటు పక్కా గృహం మంజూరైంది. జగనన్న ప్రభుత్వం ఇచ్చిన ఒకటిన్నర సెంటు స్థలంలో ఇంటిని నిర్మించుకొని అందులో చేరుకున్నాడు. జగనన్న ప్రభుత్వం వచ్చాక తన సొంతింటి కల నెరవేరిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



ఈమె పేరు ఫాతిమా లక్కిరెడ్డిపల్లె మండలం చింతకుంటవాండ్లపల్లెలో నివసిస్తోంది. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతూ ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక చింతకుంటవాండ్లపల్లె వద్ద ఏర్పాటైన లే అవుట్‌లో ఈమెకు ప్రభుత్వం ఇంటిపట్టాను మంజూరు చేసింది. తన పేరు మీద ఇల్లు మంజూరవ్వడంతో ఇంటి నిర్మాణంలో నిమగ్నమైంది. జగనన్న కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తోంది. జగనన్న రుణం తీర్చుకోలేనిదంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది.



లక్కిరెడ్డిపల్లె: చింతలకుంటవాండ్లపల్లె జగనన్న కాలనీలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

లక్కిరెడ్డిపల్లె : పేదల సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం గతంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు అందజేసి ఇంటి నిర్మాణాలను చేయిస్తున్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇల్లు లేని నిరుపేద ఎక్కడ ఉండకూడదని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హౌసింగ్ సిబ్బందికి సూచించడంతో ప్రతి ఒక్క అర్హుడికి ఇళ్ల పట్టా అందజేసి నిర్మాణానికి సైతం ప్రభుత్వం సహకరిస్తోంది. పనులు ప్రారంభమయ్యే నాటి నుంచి వివిధ దశలలో లబ్ధిదారులకు రూ.1.80 లక్షలను చెల్లిస్తోంది. జిల్లాలో ఈ బృహత్తర యజ్ఞంలో భాగంగా 76,766 ఇల్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు అధికారుల లెక్కల ప్రకారం 76,766 ఇళ్లు రిజిస్టర్ చేసుకోగా 76,072 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 25,667 ఇళ్లు పూర్తి చేశామని, 3888 రూఫ్ కాస్ట్, 7337 రూఫ్ లెవల్, బేస్‌మెంట్ స్థాయిలో 21,317, బేస్‌మెంట్ స్థాయి కంటే దిగువన 17,765 ఇళ్లు, 792 లబ్ధిదారులు పనులు మొదలు పెట్టాల్సి ఉందని గృహ నిర్మాణశాఖ పీడీ శివయ్య తెలిపారు. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలకు రూ. 707.32 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. డిసెంబర్ 23 నాటికి జిల్లాలో 49,666 ఇండ్లను పూర్తి చేయడం లక్ష్యంగా నిర్ణయించుకొని పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక, సిమెంట్, స్టీల్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నామన్నారు. అలాగే లే అవుట్‌లలో నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇళ్ల నిర్మాణాలు పుంజుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు పీడీ పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో ఇలా..

రాయచోటి నియోజకవర్గంలో మంజూరైన పక్కా గృహాలు 19198, ఇప్పటి వరకు 5600 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, ఏర్పాటవుతున్న జగనన్న కాలనీ లే అవుట్లు 93, రాయచోటి పట్టణ పేదల కోసం నారాయణ రెడ్డిగారిపల్లె వద్ద జిల్లాలోనే పెద్ద లే అవుట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడ 6,685 ఇళ్లను మంజూరు చేశారు. అలాగే చెన్నముక్కపల్లె, అబ్బవరం గ్రామ ప్రజలకు చెన్నముక్కపల్లె లేఅవుట్‌ను సుండుపల్లె రహదారి పక్కనే విలువైన స్థలాలలో ఏర్పాటు చేశారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి.

మేరా మిట్టి - మేరా దేశ్‌పై అవగాహన

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మేరా మిట్టి - మేరా దేశ్ కార్యక్రమంపై ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ చిట్వేలి జెడ్పీహెచ్‌ఎస్ ట్రూప్ కమాండర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ 75వ స్వాతంత్ర్యం సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను విజయవంతంగా ముగించుకొని 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మన ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు ఆగస్టు 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మేరా మట్టి - మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థం అమృత కలశ యాత్ర పేరుతో దేశమంతటా మట్టిని, మొక్కలను సేకరించి ఢిల్లీలో పవిత్రమైన జాతీయ యుద్ధస్మారకం సమీపంలో అమృతవాటికను నిర్మించి మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పంచ ప్రాణ ప్రతిజ్ఞను చేయించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీపీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాలాంజినేయులు



నందలూరు(రాజంపేట) : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) జాతీయ ప్రధానకార్యదర్శిగా నందలూరు వాసి ఏనుగుల బాలాంజినేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఈ విషయంపై బాలాంజినేయులు మాట్లాడుతూ తనను రెండవ సారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖపట్నంలో రెండు రోజులుగా జాతీయ కార్యవర్గ సర్వసభ్య సమావేశాలలో భాగంగా జాతీయ కార్యవర్గం ఎన్నికున్నారన్నారు. ఈ ఎన్నికలలో కేరళ అలువాకు చెందిన కె.అయ్యప్పదాస్, ప్రధాన కార్యదర్శిగా తనను, కోశాధికారిగా తమిళనాడుకు చెందిన ఎల్.రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.